వి. వాణీప్రసాద్

# అగ్నివర్షం

పెద్దిరాజు ఊరికి మకుటంలేని మహారాజు. 'రంగ' చెంపలపై ఎడా పెడా కొడ్తున్నాడు తన కాయశక్తులా,

రంగ చెంపలు కందిపోయాయి. పెదవి చిట్లిపోయింది. మనసులో రగులుతున్న కోపం, అసహ్యం కళ్ళల్లో ఎఱ్ఱగా పేరుకుంది.

అవమానంతో, బాధతో ముఖం కమిలిపోయింది. చుట్టూ మూగిన జనం తలా ఒక మాట విసురుతున్నారేకాని ఒక్కరుకూడ పెద్దిరాజు బారినుండి రంగని తప్పించటానికి ప్రయత్నించటం లేదు.

"ఊఁ చెప్పు, తప్పుచేశానని ఒప్పుకో, వదిలేస్తాను" అని పెద్దిరాజు పదేపదే తర్కిస్తున్నాడు కొడ్తున్నాడు. అయినా రంగ పెదవి కదపటం లేదు? "తప్పయిందిదొరా !" అని చెప్పటంలేదు. దెబ్బలు భరిస్తూనేవున్నాడు. రంగ భరించేకొద్ది పెద్దిరాజులో రాక్షసత్వం పెద్దదవుతున్నది... అదుగో, అప్పుడే, ఆ సమయంలోనే...చుక్క... ఏమిటా ఈ గుంపు? అని లోపలికి జొరబడింది. అంతే గుండె ఆగిపోయినట్లుంది. రక్తం ఘనీభవించినట్లయింది.

రంగ, తన రంగ—అనుకుంటు ఒక్కసారిగ పెద్దిరాజు పాదాలను పెనుబాములా చుట్టివేసింది.

"దొరా! అది తప్పు కాయండయ్యా, అది తప్పు నా తప్పుగా తెలుసుకోండయ్యా! అడ్ని విడిచిపెట్టండయ్యా! మీ పాదాలకిందోళ్ళమయ్యా" అంటు ప్రార్థించింది, ప్రాతిమాలింది.

కాని చుక్కకి తెలియదు, రంగ తప్పేమిటో? రంగ ఎందుకు మాట్లాడటంలేదో? చుక్కకి కనిపించిందల్లా ఒక్కటే-కమిలి కందిపోయిన రంగ ముఖం. తెలిసిందల్లా ఒక్కటే—పెద్దిరాజు రంగని కొడ్తున్నాడు. అందుకే—అందుకే తన కొడుకు రంగకోసం పెద్దిరాజు పాదాలనుపట్టి వేడుకున్నది.

అప్పటికే రంగని కొట్టి, కొట్టి అలసిపోయిన పెద్దిరాజుకు చుక్క ప్రార్థన ఆటవిడుపయింది. దీనంగ వేడుకుంటున్న చుక్కనోసారి చూసి పోరా దొంగనాకొడకా! ఏదో ఆడముండ ఏడుస్తుందని వదిలేస్తున్నాను. లేకపోతే నీ చమడా లొల్చేవాడిని" అంటూ చేతులు దులుపుకున్నాడు.

కొడుకు చేతినందుకుని "పదరా నాయనా!" అంది చుక్క. తల్లిచేతిని విదిల్చాడు రంగ. ఇద్దరూ గుంపు చీల్చుకుని ఇంటిదారి పట్టారు. మధ్యదారిలో మళ్లీ కొడుకు చేయందుకుంది చుక్క.

"ఎందుకురా నాయనా! అన్ని దెబ్బలు తిన్నావు? ఏం తప్పుపని చేశావురా తండ్రీ" దుఃఖంతో గొంతు జీరబోయింది. ఉబికినకన్నీటిని పమిట కొంగుతో అద్దుకుంది.

తల్లి మనసులోని వాత్సల్యం, ప్రేమ తనను పట్టుకున్న చేతినుండి శరీరంలోకి ప్రవహించినట్లుగ, ఈసారి రంగ చుక్క చేతిని విదల్చలేదు.

ఇల్లు చేరగానే, ముంగిట్లోనేవున్న కుక్కిమంచంలో కూలబడి రెండు చేతులమధ్య తల నుంచుకున్నాడు. రంగ బాధగా దిగులుగా.

చుక్కకూడ మంచంప్రక్కనే నేలమీద కూలబడింది. చుక్కలో అదే సందేహం—మళ్లీ అదే ప్రశ్న?

ప్రొద్దు వాటారుతున్నది, సంజె వెలుగు కెంజాయగ మారుతున్నది. రంగ మనసులో తల్లిపై కోపం, తాత్కాలికమైన అయిష్టత కదులుతున్నది. చుక్క మనసులో రంగపై జాలి ప్రేమ పేరుకుంటున్న ఆవేదన.

"అమ్మా! ఎందుకుచేశావా దొంగతనం?"—రంగ గొంతులో బాధ సుడులు తిరిగిందీసారి.

ఒక్కసారిగ బిత్తరపోయింది చుక్క. రంగ తన రంగ తనను దొంగతనం ఎందుకుచేశావంటున్నాడు?—రంగేనా తన కొడుకేనా అలా అడుగుతున్నది? రంగ కళ్ళు "అవును కదూ?" అని ప్రశ్నిస్తున్నట్లుగ కన్పించాయి చుక్కకి.

మాటలు కూడదీసుకుని "లేదురా రంగా! నేను దొంగతనం చేయటమేమిటి? నేనెందుకు చేస్తాను? అసలు దొరోరింట్లో పోయిందేమిటి?" అడిగింది చుక్క.

"మరయితే చెప్పమ్మా! మళ్లీ అడుగుతున్నాను. ఆ వందరూపాయలనోటు ఎక్కడిది?" గద్దించినట్లుగ, ఇక సహించలేనట్లుగ అడిగాడు రంగ—చుక్క సమాధానం చెప్పలేదు. చెప్పలేకపోయింది. ఏదో, ఏమిటో అస్పష్టంగ గొణుక్కుంది.

"అవును, నీవు చెప్పలేవు, చెప్పవుకూడ, కాని చేశావు నా పరీక్షఫీజు కోసం. ఆ డబ్బు కోసం. పదిరోజులుగ ప్రయత్నిస్తున్నావు దొరకలేదు. పెద్దిరాజును అడుగుతానన్నావు నెలనెలా జీతంలో కట్టుకోమంటానన్నావు. కాని పెద్దిరాజు అంత జాలితో, నీవు అడగగానే యిచ్చేమనిషి కాదని నాకు తెలుసు. అందుకే మొదట వద్దన్నాను అతను లేదనుంటాడు అందుకే నీవీపని చేశావు. నీవే ఎన్నోసార్లు చెప్పావు. పెద్దిరాజుగదిలో సొరుగులో ఎప్పుడు పడితే అప్పుడే నోట్లు పడేస్తుంటాడని. అవసరం నీకు అవకాశం కల్పించింది. అందుకే ఆ సొరుగునుండి తీశావు" బిత్తరపోయి చూస్తున్న తల్లినిచూసి.

"హు! ఇదంతా ఎలా గ్రహించానని ఆశ్చర్యపోతున్నావు కదమ్మా! పెద్దిరాజు దగ్గరికి వెళ్ళి వచ్చిన తెల్లావారి, నీ ప్రక్కలో వందరూపాయల నోటు కన్పించింది. నీవు లేచినతర్వాత "అమ్మా! ఎక్కడిదిది? నీ ప్రక్కలో పడుంది" అని

**'పోగొట్టుకున్న నీ శీలానికి వెలను'—అంటున్నట్లు కాళ్ళ ముందర కదులుతున్న వందరూపాయల నోటు తనను కాటువేసిన విషనాగు తాలూకు విషంగా కన్పించిందా అభాగ్యురాలికి. ఆ 'నోటు'ను చూస్తుంటే చెప్పలేని కసి!**



అడిగితే "అది...అది...పెద్దిరాజింట్లో...దొరికింది" అన్నావు అట్లా అంటున్నప్పుడు, పాలిపోయిన నీ ముఖం, ఏదో అపరాధం చేసినట్లున్న నీ బిత్తర చూపులు నాకనుమానం కల్గించాయి.

"దొరికిందామ్మా...దొరికిందా" అని గట్టిగ అడుగుతుంటే ఏమీ చెప్పకుండానే ఎటో వెళ్ళిపోయావు. అప్పుడు ఊహించానమ్మా నీవేం చేసేవో?...అయినా అమ్మా! ఎన్నోసార్లు నీవే చెప్పావు.

"వాళ్ళు పెద్దోళ్ళు ఆరింట్లో ఏది పోయిన తనిమనిషి మీదకే వస్తుందిరా, అందుకే జాగ్రత్తగుండాల. పూచిక పుల్లైనా ముట్టుకోను నేను. నా పనేదో. నేనేదో" అని. అలాంటి నువ్వు ఈరోజిలాంటి పనిచేశావంటె నమ్మలేకపోయానమ్మా! కాని...కాని"

రంగ చెప్తున్నదంతా–ఓ కథగా, వింటూ, విచిత్రంగా చూస్తుండిపోయింది చుక్కి. "అబద్ధంరా నీవనుకున్నదంతా అబద్ధంరా" అంటున్నట్లుగా ఆమె పెదవులు మాత్రం చలిస్తున్నాయి. మనసులో రేగుతున్న తుఫానుకు గుర్తుగా ఆమె వళ్ళు కంపిస్తున్నది

తను అలా నిలదీసి అడిగినందుకు కాబోలు అమ్మ అలా వణికిపోతున్నది అనుకుని తల్లివంక జాలిగా చూశాడు రంగ. నచ్చచెప్తున్నట్లుగ "అమ్మా! అసలు నేను చదువుకునేదెందుకు? మనిషిగా నిలబడటానికి, వివేకంతో మసలటానికి, నీతిగా బ్రతకడానికి. కాని అలాంటి నా చదువుకు, పరీక్షకు ఫీజు కట్టటంకోసం–నీవు దొంగతనం చేయాల్సివస్తే అలాంటి చదువు నాకక్కరలేదమ్మా! ఈసారి కాకపోతే ఇంకోసారి రిక్షా లాగో–రెక్కల కష్టంచేసో ఫీజుకట్తాను, పరీక్ష రాస్తాను. కాని...మనం పోగొట్టుకున్న నీతికాని, మనశ్శాంతికాని మళ్లీ వస్తుందామ్మా?

అందుకే ఆనోటును పీలుచూసుకుని పెద్దిరాజు గదిలోని డ్రాయరు సొరుగులో వుంచాలనుకున్నాను. ఆ ఇల్లంతా నాకూ బాగా తెలుసుగా అందుకే ధైర్యంచేసి వెళ్ళాను. లేదా ఆతనికే ఏదోవిధంగా అందించాలనుకున్నాను.

కాని...ఆప్రయత్నంలోనే...నేనో దొంగగా పట్టుబడవలసివచ్చింది. సాక్ష్యంగా నా జేబులో వంద రూపాయల నోటుంది. చిన్నప్పటినుండి చదువులో నాకంటె బాగా వెనకపడ్డ నర్సిరాజు, ఈర్ష్యకొద్దీ యీ పనిచేశాడమ్మా! దాంతో పెద్దిరాజు చెయ్యిచేసుకున్నాడు.

"దొంగతనం చేశానని" ఒప్పుకోఅని వేధిస్తే మటుకు చేయని నేరాన్ని 'ఔను' అని ఎలా చెప్పను, చెప్పమ్మా!...లేదు "మా అమ్మే చేసిందని"—అసలెలా చెప్పగలను?—అందుకే మాట్లాడకుండ వుండిపోయా. చివరికి వాళ్ళే వదిలేస్తారనుకున్నాను.

అంతలో నీవు వచ్చావు ఇప్పుడు చెప్పమ్మా! నేనెందుకు దెబ్బలుతినవలసి వచ్చిందో? ఏం తప్పుపని చేశానో??

కొడుకు ప్రశ్నలకు ఏ సమాధానం చెప్పలేక రంగ రెండు చేతుల్లోనూ ముఖం దాచుకుంది చుక్కి. వెక్కి వెక్కి ఏడ్చింది.

మనసును మండిస్తున్న నిజాన్ని వెలికిచెప్పుకోలేక, బాధనూ భరించలేని చుక్కి చెంపలపై దుఃఖం కాల్వలు కట్టింది.

ఆమె కళ్ళనుండి కారింది కన్నీళ్ళుకాదు-రక్తాశ్రువులు.

ఆ దుఃఖానికి మూలం ఆవేదన మాత్రమే కాదు-రెండు రకాలుగా మసగిపోబడ్డామే అనే ఆక్రోశం.

ఆ ఆక్రోశానికి అంతరార్థ మేమిటి?

జవాబు చెప్పుకోలేకపోవటానికి కారణం ఏమిటి?

* * *

"పరీక్షకు ఫీజు కట్టాలమ్మా!" అని రంగ పది రోజుల క్రితమే చెప్పాడు. అప్పటినుండి కూలి పనిలో వచ్చిన పైసలను-బియ్యం కొనుక్కుని తింటే డబ్బు ఎక్కువవుతుందని నూకలు కొనుక్కుని. ఒక పూట నూకలు వండుకుని, మరోపూట గంజి తాగి కొంత కూడేసింది చుక్కి. ఊహు! అయినా అవి సరిపోయేటట్లులేవు. ఎవరిని అడగాలి? ఎవరు సాయంచేస్తారు?- తనతోటివాళ్ళు, తన వంటివాళ్ళే. ఏ పూట కాపూట సొదరు ఖర్చుకు వెతుక్కునే వారే. ఇంకెవరిస్తారు??

చుక్కి మనసులో పెద్దిరాజు మెదిలాడు. కొడుకుతో చెప్పి బయలుదేరింది.

మునిమాపువేళ, చలిగాలి వీచేవేళ, పెద్దిరాజింటికి వెళ్ళింది చుక్కి.

"ఒక్క ఏభై రూపాయలివ్వండి దొరా! రంగకు పరీక్షకు పైసలు కట్టాలి" అని అడిగింది చుక్కి దొరగారిని.

"ఇప్పుడు పైస లెక్కడివే? కలుపు కూళ్ళకే ఎతుక్కుంటుంటే, ఎక్కడైనా అడుక్కో ఫో!" అన్నాడు పెద్దిరాజు విసుగ్గా.

చుక్కిలో ఆశ చివుక్కుమంది.

---



### గొడుగా

ఇద్దరు పోలీసులు దొంగని తీసుకెళుతున్నారు.

మధ్య దారిలో వర్షం వచ్చింది.

"వర్షం పడుతోంది. గొడుగు తెస్తా మీరిక్కడే ఉండండి" అన్నాడు దొంగ పోలీసులతో.

"అదేం కుదరదు. నువ్వేఇక్కడుండు. మేమే వెళ్ళి గొడుగు తెస్తాం" అన్నారు పోలీసులు తెలివిగా.

—ఎ. యోగానందాచారి (కూనవరం)

---

"అట్ట గంటె ఎట్టాదొరా? మీరే దయ చూడాలి. నెలనెల జీతంలో కోసుకోండి" అంది బతిమాల్తూ.

"పైసల్లేవే అంటె ఎంట పడ్తావేమే? ఎళ్ళెళ్ళు" అనేసి, చీదరించుకుంటు పడక కుర్చీలో విశ్రాంతి తీసుకున్నాడు పెద్దిరాజు.

చుక్కిలో ఆశ సన్నగిల్లింది.

పైసల్లేక-రంగ పరీక్ష రాయకపోతే తను, తన కొడుకు పెంచుకున్న ఆశలు, విరిగిపోతున్నట్లనిపించింది.

శ్రద్ధగా, కష్టపడి, చదువుతుంటున్న రంగ చుక్కి కళ్ళల్లో కదిలాడు. అతగాడి కలలు కరిగిపోకూడదు.

అందుకే మనసు ముందుకు పొమ్మంది, రంగ తల్లిగా, కేవలం రంగ తల్లిగా, వాని కలలు పండించవలసిన తల్లిగా, పెద్దిరాజు పాదాలపై తల మోపి మళ్ళీ, మళ్ళీ ప్రార్థించింది చుక్కి.

పేదోళ్ళం, మా కష్టాన్నాదుకోవలసింది మీరే దొరా! మీరే అట్టగంటె మా కెవరు దిక్కు? అని పెద్దిరాజుకు పెద్దతనాన్ని అంటగట్టింది.


అలా అంటున్న చుక్కి కళ్ళకు నీటి పొర కమ్మింది...

పాదాలంటిన చుక్కిలో పెద్దిరాజుకు ఆమె దీనవదనం కన్పించలేదు...—వయసు యవ్వన పరిధిని దాటినా చుక్కిలో ఇంకా జారిపోని అందాలు కన్పించాయి.

**ఆ వేడుకోలులో చుక్కి పేదతనం ధ్వనింపలేదు...—ఆ పేదరికాన్ని తన కనుకూలంగా**

---

పార్టీ —వి.వి.ఎస్. మూర్తి





## వెనుకబడిన....

హరి, గిరి బడికిపోతున్నారు.

"ప్రభుత్వం వెనుకబడిన తరగతుల వారికి సహాయం చేస్తుంది కదా! నాకుకూడా సహాయం చేస్తుందా?" అడిగాడు హరి గిరిని.

"నీకెందుకు చేస్తుంది?" ఆశ్చర్యంగా అన్నాడు గిరి.

"మరి నీకంటే నేను ఓ తరగతి వెనుక వద్దానుగా" అన్నాడు హరి తెలివిగా.

—బి సుబ్రహ్మణ్యంరెడ్డి (హైద్రాబాద్)

మలుచుకోగల అవకాశం విన్పించింది.

అతని పెదవులపై కదిలిన చిర్నవ్వు ఆమె పట్ల సానుభూతితో కాదు....—మనసులో కల్గిన జుగుప్సాకరమైన వాంఛకు ప్రతిరూపంగా అంతే!

చుక్క మీదకు పెద్దిరాజు.

ఆవు మీదకు పులిలా.

అసహాయత మీదకు రాక్షసత్వంలా, విజృంభించాడు.

పెద్దిరాజుకు తోడుపడుతున్నట్లుగ చీకటి చిక్కగా అలుముకుంది.

చుక్కకి శాపమయింది.

సహాయం చేస్తాడనుకున్న వ్యక్తి సర్వం దోచుకో ప్రయత్నిస్తుంటే, ప్రాణాలు నిల్పవలసిన గాలి పెనుగాలిగా మారి పద్రదోస్తే, దొరగా పిలుచుకుంటున్న వ్యక్తి దౌర్భాగ్యపు పనికి పూనుకుంటే, బిత్తరపోయింది చుక్క, భయపడింది, బెంగపడింది, అవాక్కయింది, ఆలోచనా రహిత అయింది.

మాట పెగిలిరాక, ఎదిరించే, శక్తి ఉడిగి, ఛిన్నాభిన్న అయి, పెను తుఫానుకు గురి అయిన ప్రకృతిలా భీభత్స అయింది.

అలానే నేలన కూలబడిపోయింది.

బీదతనాన్నే దోచుకున్న ఘనమైన. మరానా దొంగ పెద్దిరాజు వికటంగా, వికృతంగా, విలాసంగా నవ్వుతూ, ఓ వందరూపాయల నోటు చుక్క ముందు విసిరి వెళ్ళిపోయాడు.

జరిగిపోయిన దుర్ఘటనకు తన శరీరం సాక్షీభూతంగా నిలుస్తుంటే తనను తాను చీదరించుకుంది చుక్క. పెద్దిరాజును ఛీత్కరించుకుంది.

'పోగొట్టుకున్న నీ శీలానికి వెలను'- అంటు న్నట్లు కాళ్ళ ముందరి కదులుతున్న వంద రూపాయలనోటు తనను కాటువేసిన విషనాగు తాలూకు విషంగా కన్పించిందా అభాగ్యురాలికి.

ఆ 'నోటు'ను చూస్తుంటే చుక్కలో అంతు లేని కసి, ఇంత అని చెప్పలేని కసి.

విలాసంగా, విషపు నవ్వు నవ్వుతున్న ఆ నోటును జుగుప్సతో ముట్టుకుంది.

నలిపివేయాలని అందుకుంది.

చింపివేయాలని పట్టుకుంది.

వంద రూపాయల నోటులోని (100) వంద అంకె గదిలోని బెడ్‌లాంపు వెలుతురులో తళుక్కుమంది. నన్ను చంపలేవన్నట్లు గర్వంగా నవ్వింది.

నోటులో-రెండు సున్నలకు ఎడమవైపుగా-ధీమాగా-హుందాగా నిలబడివున్న (1) ఒకటి అంకె తన కొడుకు విలువయిన భవిష్యత్తులా కన్పించి, అందుకు అవసరమైన డబ్బును గుర్తుకు తెచ్చింది చుక్కకి.

(1) ఒకటి లేని రెండు సున్నలు (00) తన జీవితం లాగే వెల్తిగా కన్పించాయి చుక్కకి.

వెలుగులోకి రావలసిన రంగ జీవితమా?

చీకటిలోకి త్రోయబడిన తన మనఃస్థితా?— ఏది విలువయినది?

దేనికి విలువ ఇవ్వాలి?

ఏ నోటయితే తనకు అసహ్యమో, అది రంగ భవిష్యత్తుకు పునాది ఔతుంది. ఏది తనకు విషప్రాయమో,-అది రంగకు అవసరం.

తను కోరుకోవలసింది తన కొడుకు బాగు గాని-తన ఓగును గురించిన ఆలోచనకాదు.

ఆ నోటును చించిపారేసినంత మాత్రాన చిని గిన తన బ్రతుకు అతుకుందా?...అటువంటి పరిస్థితిలోను-డబ్బు అవసరం—రంగ గురించి కన్న కలలు, చుక్క గుండెల్లో చోటు చేసుకున్న, ఓ క్షణిక బలహీనత,-ఇవన్నీ కలిసి 'లేదు...లేదు ...లేదు' అన్నాయి. అందుకే చుక్క ఆ వంద రూపాయల నోటును పామును నడుముకు చుట్టుకున్నట్లుగా-రొంటిలో వుంచుకుంది.

కాళ్ళీడ్చుకుంటూ కొడుకు కోసం,-కేవలం కొడుకుకోసం ఇంటికి చేరింది చుక్క...కుక్కిమంచంలోపడి కుమిలిపోయింది.

లాంతరు వెలుగులో చదువుకుంటున్న రంగ "ఇంతాలశ్యమయిందేమ్మా? అలా పడుకున్నావేమిటి?" అని అడుగుతుంటే గొంతు కూడ దీసుకుని, గుండె చిక్కబట్టుకుని "ఏంటో నీరసుంగుందిరా", అని ముడుచుకుని పడుకుంది.

తల్లికెలా వుందో చూద్దామని లేచి వంటిమీద చేయివేసి చూసిన రంగకు తల్లి వళ్ళు చమటతో, చల్లగా వుండటం గమనించి "అలసట అయిందమ్మా, కాసేపు పడుకో, అసలు వెళ్ళిన పనేమయింది?" అని అడిగాడు.

చుక్క సమాధానం చెప్పలేదు...

పెద్దిరాజు పైసలివ్వలేదు కాబోలు, మళ్ళీ మళ్ళీ అడగట మెందుకలే ఇస్తే తనే చెపుతుందిగా, అనుకుంటు మళ్ళీ పుస్తకం ముందు కూర్చున్నాడు రంగ.

లాంతరు వెలుగులో, లోపలికిపోయిన రంగ పొట్టను చూసిన చుక్కకి అన్నం వండాలని గుర్తుకు వచ్చింది. కొడుకుకోసం తప్పదని లేవ

కళ్ళు —పండరినాథ్



పోయింది. తల్లి ఉద్దేశం అర్థం చేసుకున్నట్లుగా రంగ "అన్నం వండేశానమ్మా, కాసేపు పడుకో" అన్నాడు.

మళ్లీ అన్నం తినమని రంగ ఎన్నిసార్లు లేపినా, కొడుకుంది బంధవారిన హృదయంతో అలాగే పడుకుండిపోయింది.

* * *

తెల్లవారింతర్వాత ఎప్పటికో లేచింది చుక్క.

"అమ్మా! ఎక్కడిదీ వంద రూపాయల నోటు?" అని రంగ ఆశ్చర్యంగా ప్రశ్నిస్తుంటే చుక్క ముఖం పాలిపోయింది.

జరిగిన అవమానం మళ్లీ కళ్ళ ముందు కదిలింది. ఆ క్షణంలో- ఆ వంద రూపాయల నోటును తీసుకుని వచ్చినందుకు సిగ్గుతో చితికిపోయింది. ఆశ్చర్యంతో ప్రశ్నిస్తున్న రంగకు మాటలు కూడదీసుకుని "అది......అది పెద్దిరాజింట్లో దొరికింది" అన్నది. ఏమి చెప్పటానికి తోచక, ఆ అబద్ధం చెప్పటానికి పంచప్రాణాలు పణంగా పెట్టింది.

"దొరికిందా?...దొరికిందా?" అని మళ్ళీ మళ్లీ ప్రశ్నిస్తున్న కొడుకుకు ముఖం ఎత్తి సమాధానం చెప్పలేకపోయింది. అందుకే పిచ్చిదానిలా ఇల్లు దాటి-వాడ దాటి- ఊరు దాటి-తోటల్లోకి, పొలాల్లోకి వెళ్ళింది. అక్కడ తనివిదీరా ఏడ్చింది. తర్వాత చచ్చిపోవాలనుకుంది. ఎటైనా వెళ్ళిపోదామనుకుంది. లేదా కొడుకుతో జరిగిందంతా చెప్పుకుని దుఃఖ భారాన్ని తగ్గించుకోవాలనుకుంది. గుండెల్ని కాలుస్తున్న నిప్పును ఆర్పుకోవాలనుకుంది.

కాని...కాని... చివరికి ఏదీ చేయలేకపోయింది.

తండ్రి వుండీ లేని పిల్లవాడని రంగను కళ్ళల్లో వత్తులు వేసుకుని మరీ పెంచుకుంది చుక్క.

ఆ కొడుకు కోసం-తన మావ తన మీద మోజు తీర్చుకుని, మరొకతెతో మనువాడినా గుండె రాయి చేసుకుని బ్రతికింది. తన్ను మారుమనువు చేసుకుంటానని వచ్చిన 'వెంకడు' తన రంగని సరిగా చూస్తాడో లేదోననే శంకతో, భయంతో అట్లాగే వుండిపోయింది. తను తిన్నా, తినకున్నా, వాడి కడుపు నింపి తృప్తిగా నిశ్వసించింది. తన రంగపై ఎన్నో ఆశలు పెంచుకుంది, కలలు కంది.

వాడికోసమే శ్రమిస్తున్నది, బ్రతుకుతున్నది.

ఆ రంగడిని గాలికి వదిలేసి చుక్క చచ్చిపోగలదా? ఒక్క తెలియని చోటకు వెళ్ళిపోగలదా? ఆ ఊహే ప్రేగుల్ని నులి పెడుతుంటే, తిరిగి, తిరిగి ఇంటిదారి పట్టింది చుక్క.

ఊర్లోకి అడుగు పెట్టింది. పెద్దిరాజింటి ముందునుండే తన ఇంటికి వెళ్ళవలసినందుకు అసహ్యపడుతూనే కాలు కదిపింది. కదిలిన కాలిని, ఆ ఇంటి ప్రాంగణం ముందున్న గుంపు, గోల, అరుపులు ఆపివేశాయి. అదేమిటోనని గుంపులో జొరబడింది చుక్క.

తన సర్వస్వం దోచుకున్న ఆ నీచుడి కాళ్ళే మళ్ళీ ముట్టుకుని కొడుకుని రక్షించికుంది చుక్క.

అసహ్యం నింపుకున్న మనసుతోనే ఆ రాత్రిని జతచేసింది. ఇప్పుడు ఆ 'రంగే'- తన 'ప్రేగే' ప్రశ్న మీద ప్రశ్న వేస్తుంటే ఏం చెబుతుంది చుక్క? ఎలా సమాధానపరుస్తుంది? 'తన తల్లి దొంగతనం చేసింది', అన్న ఊహే భరించలేక చేయని నేరానికి శిక్ష అనుభవించిన రంగకు,



## డ్రామా

"డ్రామారావ్.. డ్రామారావ్?" పిలుస్తున్నాడు కోర్టులో బంట్రోతు.

ఓ ఆసామీ గబగబా వచ్చాడు.

"నా పేరు డ్రామారావు కాదు" కోపంగా చెప్పాడు.

"మరేమిటి?" అడిగాడు బంట్రోతు.

"డి. రామారావు" చెప్పాడతను.

—బి. ఎ. విక్టర్‌బాబు (రాజమండ్రి)

తను పోగొట్టుకున్న కలిమిని గురించి ఏమని చెప్తుంది? ఎంతని చెప్తుంది? ఏ బలహీనతతో, ఏ విధంగా ఆలోచించి ఆ నోటుతో ఇంటికి చేరిందో, తానెంత సిగ్గుపడిందో ఎలా చెప్తుంది చుక్క? ఎలా నచ్చ చెప్తుంది?

అందుకే విడమర్చి చెప్పుకోలేక కొడుకు చేతుల్లో ముఖం దాచుకుని అనంతమైన దుఃఖాన్ని, హృదయాన్ని చీల్చేస్తున్న దుఃఖాన్ని అగ్ని కణాల్లా, కొడుకు దోసిలిలో నింపింది చుక్క.

తల్లి వెచ్చని కన్నీళ్ళతో చేతులు తడిసిపోతుంటే, తల్లి మీద ఏ మూలనో దాగిన కోపం కన్నీళ్ళతో కలిసి కరిగిపోయింది.

అమ్మ ఏం చేసినా తనకోసమే చేసిందను కుంటే—

ఆ మాతృ ప్రేమకు అతని హృదయం కదిలిపోయింది. చుట్టూ చీకటి ముసురుకుంది.

కాని...కాని...

తన తల్లి మనసులోనూ పేరుకున్న చీకటిని తెలుసుకోగల్గితే-తమ పేదతనమే తమ పాలిట శాపమైందని గ్రహించుకోల్గితే- జరిగిన అనర్థమేమిటో అర్థమయినా, అతని మనసులో అగ్ని రగలదూ?

రగిలిన ఆ అగ్ని, అగ్ని వర్షమై,

అగ్నిగోళమై-అగ్ని చక్రమై,

అమానుషాన్ని, అకృత్యాన్ని, నిరంకుశత్వాన్ని కాల్చివేసి, కూల్చివేయదూ?

ఆ విజృంభణ యిప్పుడో, రేపో? మరెప్పుడో? అయినా అది నిజం, జరిగితీరే సత్యం.

ఆగని నిత్యం. *

పేరు —ప్రసాద్

